క్లుప్తంగా

'ప్రజాసంక్షేమమే లక్ష్యం'

కౌటాల: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ దండె విఠల్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పనులు త్వరగా ప్రారంభిస్తామని తెలిపారు. పనులు చేపట్టకపోతే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయనని ప్రకటించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు నికాడే గంగారాం, దుబ్బుల నానయ్య, రామయ్య, వసంత్‌రావ్, రవి, ఖాశీం, పోశం, నాహీం తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) మండలంలోని పాతట్లగూడ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్సీ నివాసంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ దండె విఠల్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుమారు 40 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో దేవాజీ, రాజేందర్, పాండు, కాపీడే రాజు, చౌదరి శ్యామ్‌రావు, కార్యకర్తలు ఉన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయా గ్రూప్‌లలో మిగిలిన సీట్లకు ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ డిగ్రీలో చేరని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ తీసుకునే విద్యార్థులు ఉపకార వేతనాలకు అర్హులు కారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

సిర్పూర్(టి): సంక్షేమ వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రైవేటు విద్యార్థులకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించాలని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి జాడి సంజీవ్‌కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కోనేరు ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి'



మాట్లాడుతున్న కోనేరు అభిమానులు

పెంచికల్‌పేట్: కాగజ్‌నగర్ పట్టణంలో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న కోనేరు కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి కోనేరు అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోనేరు అభిమానులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు అండగా నిర్వహించే సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీనివాస్, సంజీవ్, రాజన్న, సుధాకర్, మాజీ ఎంపీటీసీ సాజీద్, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, చలం , బండన్న, ఎస్కే బాబు, ఇస్తారి, మహేశ్, మల్లయ్య, రమేశ్, ఖైరాత్, సిద్ధు, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

'నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలు'



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న జీఎం

రెబ్బెన: నిరంతర సాధనతో క్రీడానైపుణ్యాలు మెరుగుపడుతాయని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 93వ వార్షిక క్రీడలను ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఏఐటీయూసీ నాయకులు బయ్యా మొగిళి, అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్‌కుమార్, ఎస్వోటూజీఎం రాజమల్లు, డీజీఎం మదీనాబాషా, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ అన్వేష, జనరల్ కెప్టెన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా అందేదెప్పుడో..!



పింఛన్‌ల పెంపు, నూతన పింఛన్‌ల మంజూరుకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

- పింఛన్ కోసం వేలల్లో దరఖాస్తులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వైనం
- నేటికీ విడుదల కాని మార్గదర్శకాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఆసరా పింఛన్‌ల కోసం ఆశావహులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి పింఛన్‌ల మంజూరుపై స్పష్టత ఇవ్వకపోవడంతో 18 నెలలుగా దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ పింఛన్‌లు ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనలో దరఖాస్తులు సైతం స్వీకరించింది. ఈ మేరకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, బీడీ, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలిసిస్ బాధితులు సుమారు 8వేల మంది దరఖాస్తు చేసుకున్నారు.

తప్పని ఎదురు చూపులు..

పింఛన్‌దారులకు గత ప్రభుత్వం నెలకు రూ. 2016 చొప్పున అందిస్తుండగా, అధికారంలోకి వస్తే రూ. 4,016కు పెంచుతామని కాంగ్రెస్ ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజావాణి కార్యక్రమంలోనూ మరోసారి దరఖాస్తులు చేసుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 53,574 మంది లబ్ధిదారులు వివిధ రకాల పింఛన్లు పొందుతుండగా వీరిలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, కల్లుగీత, చేనేత, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, డయాలిసిస్, ఫైలేరియా కార్మికులు ఉన్నారు. వీరికి ప్రతీనెలకు రూ.13.03 కోట్లు పంపిణీ చేస్తున్నారు.

జిల్లాలో వివిధ రకాల పింఛన్ల లబ్ధిదారులు..	
వృద్ధులు	22,658
వితంతువులు	21,254
దివ్యాంగులు	5,759
కల్లుగీత కార్మికులు	132
చేనేత కార్మికులు	474
ఫైలేరియా	553
డయాలసిస్	100
బీడీ కార్మికులు	88
ఒంటరి మహిళలు	2,556
మొత్తం	53,574

మంజూరేది..?

వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వారు మరణిస్తే వారి పింఛన్ నిలిపివేస్తున్నారే తప్పా.. అతని భార్యకు మాత్రం వితంతు పింఛన్ మంజూరు చేయడం లేదు. జిల్లాలో నూతనంగా పింఛన్‌ల కోసం సుమారు 8వేలకు పైగానే దరఖాస్తులు వచ్చాయి. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులు విచారణకు నోచుకోకుండా కార్యాలయాల్లో కుప్పలుగా పేరుకుపోతున్నాయి.

పింఛన్ మంజూరు చేయండి



ప్రభుత్వం అందిస్తున్న ఒంటరి మహిళ పింఛన్‌ను త్వరగా మంజూరు చేయాలి. నేను దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా పింఛన్ రావడం లేదు. సంబంధిత అధికారులను అడిగితే వస్తది అనే చెబుతున్నారు. కానీ రావడం లేదు.
– కమాన్‌కర్ లీలా, ఖమానా, వాంకిడి

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ



నా భర్త మరణించి 3 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ నాకు వితంతు పింఛన్ రాలేదు. ప్రజాపాలనలో కూడా దరఖాస్తు చేసుకున్నాను. కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదు. నాకు ఆరోగ్యం సహకరించడం లేదు. ప్రభుత్వం త్వరగా పింఛన్ మంజూరు చేయాలి.
– చెన్నూరి లక్ష్మి, ఆసిఫాబాద్

వితంతు పింఛన్‌కు దరఖాస్తు



వితంతు పింఛన్ కోసం 3 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాను. నా భర్త 2021లో మరణించారు. దరఖాస్తు చేసుకొని మూడు సంవత్సరాలు అవుతున్నా నేటికీ పింఛన్ మంజూరు కాలేదు. ప్రభుత్వం స్పందించాలి. – జాడి గున్నబాయి, గంగాపూర్, మం.చింతలమానెపల్లి

సమాజానికి సేవ చేయాలనే తపన ఉండాలి



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

రెబ్బెన: సమాజానికి సేవ చేయాలనే తపన అందరిలోనూ కలగాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధులు, వినియోగదారుల హక్కుల ఫోరం సభ్యులతో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర అత్మారాంనాయక్, ఫౌండేషన్ ప్రతినిధులు పరికిపండ్ల రాము, రాజేందర్, వినియోగదారుల హక్కుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గోగర్ల శోభన్‌బాబు, పౌండేషన్ సభ్యులు దుర్గం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



దహెగాం: చంటి పాపను ఎత్తుకొని క్యూలో నిల్చున్న మహిళా రైతు

దహెగాం: రైతులు యూరియా పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘం, గిరవెల్లి గ్రామంలోని రైతువేదికలో శనివారం యూరియా పంపిణీ చేస్తున్నారని తెలియడంతో రైతులు ఉదయాన్నే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. రెండు లారీల యూరియా, 880 బస్తాల కోసం ఈ రెండు కేంద్రాల వద్ద వేల మంది రైతులు బారులుదీరారు. రెండు బస్తాల కోసం ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా బస్తాలు అయిపోవడంతో చాలా మంది రైతులు వెనుదిరిగిపోయారు. యూరియా కోసం మహిళలు సైతం బారులు తీరారు. మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన భారతి అనే మహిళా రైతు చంటి పాపతో క్యూలో నిలబడింది. మరో రెండు రోజుల్లో మండలానికి వంద టన్నుల యూరియా వస్తుందని, సోమవారం యూరియా పంపిణీ చేస్తామని ఏవో రామకృష్ణ తెలిపారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 444 బస్తాల యూరియా రాగా ఆయా గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతులు తరలివచ్చారు. అధికారులు ఒక్కొక్కరికి రెండు యూరియా బస్తాలు అందించారు. సాయంత్రం వరకు వేచి చూసిన కొందరు రైతులు యూరియా అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

రెబ్బెన: స్థానిక పీఏసీఎస్‌కు శనివారం 888 బస్తాల యూరియా రాగా రైతువేదికల వద్ద టోకెన్లను జారీ చేశారు. దాంతో రైతులు బస్తాల కోసం బారులు దీరారు. పోలీసుల బందోబస్తు నడుమ యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేపట్టగా, ఒకవైపు మహిళ రైతులు, మరోవైపు పురుష రైతులు బస్తాల కోసం క్యూలైన్లలో బారులు దీరారు. గతంలో మాదిరిగా ఈ సారి ఎలాంటి ఆందోళన లేకుండా సాఫీగా యూరియా పంపిణీ జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

రైతులకు పూర్తిస్థాయిలో యూరియా పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని రైతులకు పూర్తిస్థాయిలో యూరియా బస్తాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మండలంలోని జంబుగ రైతు వేదికలో రైతులకు పంపిణీ చేస్తున్న యూరియా పంపిణీ సరళిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఆందోళనకు గురికావద్దని, ఆదిలాబాద్ నుంచి మరో యూరియా లోడ్ సిర్పూర్ నియోజకవర్గానికి వస్తుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ పీఏసీఎస్‌లో రైతులకు అందజేస్తున్న ఎరువులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈరోజు 60 టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. సోమవారం మరో 60 టన్నుల యూరియా పంపిణీ చేస్తామని, జంబుగ రైతు వేదికలో 40 టన్నుల యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు. వ్యవసాయాధికారులు సృజన, శ్రీనివాస్, శైలేష్, సీఈవో సతీశ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా యూరియా పంపిణీ చేయాలి

కౌటాల: రైతులకు పకడ్బందీగా యూరియా పంపిణీ చేయాలని తహసీల్దార్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం కౌటాల, గుడ్లబోరి రైతు వేదికలో రైతులకు పంపిణీ చేసిన యూరి యా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా అందించాలన్నారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. యూరియా కోసం రైతులు బారులు దీరారు. యూరియా కేంద్రాన్ని సీఐ సంతోష్‌కుమార్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ స్థానిక కేజీబీవీ, బీసీ వసతి గృహాలను పరిశీలించారు.

యూరియా కోసం వచ్చిన రైతులకు అన్నదానం



సిర్పూర్ (టి): భోజనం వడ్డిస్తున్న నాయకులు



బెజ్జూర్: అన్నదానం చేస్తున్న కోనేరు కోనప్ప

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద శనివారం మండలంలోని రైతులకు అధికారులు యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించగా యూరియా కోసం వచ్చి పడిగాపులు కాస్తున్న రైతులకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో స్థానిక నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కిజర్‌హుస్సేన్, మాజీ ఎంపీటీసీ దుర్గం విక్రమ్, నాయకులు కోనేరు ఫణి, తంగెడిపల్లి సంతోష్, బొమ్మెన శ్రీనివాస్, ఇఫాత్‌హుస్సేన్, తిరుపతి, అహ్మద్ హుస్సేన్, లాలాజి, షేక్ వసీం, బోర్కుట్ మోహన్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘానికి యూరియా కోసం వచ్చిన రైతులకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శనివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు యూరియా పంపిణీ చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియాను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కోనేరు అభిమానులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం వద్ద యూరియా కోసం వచ్చిన రైతులకు శనివారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచరులు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ యూరియా బస్తాల కోసం వేచి ఉంటున్న రైతులు ఆకలితో అలమటించొద్దని అన్నదానం చేసినట్లు తెలిపారు. సంఘం చైర్మన్ మాంతయ్య, నాయకులు శైలజాగౌడ్, మధుకర్, భీమయ్య, బ్రహ్మయ్య, వసంత్‌రావ్, బాపు, తిరుపతి, మనీశ్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి జయప్రదం చేయాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ. 4వేలు పెన్షన్ ఇస్తానని, దివ్యాంగులకు రూ. 6 వేలు పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్న డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన చేపడుతున్న తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కేశవ్‌రావ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 20వ తేదీన గ్రామపంచాయతీల ఎదుట ధర్నా, అక్టోబర్ 6వ తేదీ నుంచి నవంబర్ 6 వరకు నెల రోజుల పాటు ప్రభుత్వంపై వివిధ రకాల నిరసన దీక్షల పోరు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఉపాధిహామీ పనులపై గ్రామసభ

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి, లోద్దిగూడ, పిట్టగూడ, పిక్లాతండా, జాముల్‌ధర, చోర్‌పల్లి, మామిడిపల్లి గ్రామ పంచాయతీల్లో ఆదివారం ఉపాధిహామీ పనులపై గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ధ్రువపత్రాల పంపిణీ



ధ్రువపత్రాలు అందజేస్తున్న విజయ భాస్కర్ రెడ్డి

రెబ్బెన: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అందించిన ఉచిత వోల్వో డంప్ ట్రక్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శనివారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి ధ్రువపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏరియాలోని నిరుద్యోగ యువత స్వయం ఉపాధిలో రాణించాలనే లక్ష్యంతో హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న నిరుద్యోగ యువతకు ఉచితంగా వోల్వో డంప్ ట్రక్ శిక్షణ అందించినట్లు తెలిపారు. ఈ శిక్షణకు 12 మంది యువకులు హాజరు కాగా పరీక్షల్లో 7 మంది యువకులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బయ్యా మొగిళి, ఎస్వోటూజీఎం రాజమల్లు, ఎంవీటీసీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



లింగాపూర్: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



కెరమెరి: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దీక్షిత

లింగాపూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని లింగాపూర్ ప్రాథమిక కేంద్రం వైద్యురాలు అనిత పేర్కొన్నారు. శనివారం మండలంలోని వంకామద్ది గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పులువురికి వైద్య పరీక్షలు చేసి జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా తదితర లక్షణాలు ఉన్న వారిని గుర్తించారు. ల్యాబ్ అసిస్టెంట్ అశోక్ కుమార్ రక్తపరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.

అనార్‌పల్లి ఆశ్రమంలో..

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కెరమెరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి దీక్షిత తెలిపారు. ఆ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని, రక్తపూతలు సేకరించామని తెలిపారు. అనంతరం దోమలు, వ్యాధుల నివారణకు మందు పిచికారీ చేసినట్లు పేర్కొన్నారు. హెచ్‌ఈవో మెస్రం సోము, హెచ్‌ఏలు వసంత్, శంకర్, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

లింగాపూర్: సీజనల్ వ్యాధులపై దృష్టి సారించి వైద్యులు వైద్యశిబిరాలు నిర్వహించాలని డైరెక్టర్ ఆజ్మీరా అమర్‌సింగ్ నాయక్ అన్నారు. డీఎంహెచ్‌వో సీతారం, మలేరియా అధికారి వినయ్‌కుమార్‌తో కలిసి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. ఆసుపత్రిలో రిజిస్టర్, మందులు పరిశీలించారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై అక్రమ కేసులు సరికాదు



మాట్లాడుతున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్ఎంపీ, పీఎంపీలపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని ఆసిఫాబాద్ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నాయకులు తిరుపతిచారి, నారాయణ, కేదారిగౌడ్‌లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం శోచనీయమన్నారు. వెంకన్న, శ్రీనివాస్‌చారి, మల్లేశ్, లక్ష్మణ్, సందీప్, శ్రీకాంత్, మహేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీఎన్ వెంకటరమణ వర్ధంతి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో శనివారం కామ్రేడ్ టీఎన్ వెంకటరమణ వర్ధంతి నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కామ్రేడ్ వెంకటరమణ మార్క్సిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై విద్యార్థి సంఘాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. సిర్పూర్ పేపరు మిల్లులో బైలర్‌హౌజ్ డిపార్టుమెంట్‌లో ఇంజనీర్‌గా పని చేస్తూ మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజా సమస్యలపై పోరాటంచేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, ముంజం, శ్రీనివాస్, రవి, కృష్ణ పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్‌ల సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్ పట్టణంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే ఫొటో ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్, వాంకిడి ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్‌ల సంఘం నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో వచ్చే కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆధునిక పరికరాలపై ఫొటోగ్రాఫర్స్ అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. మండల అధ్యక్షుడిగా సందీప్, ప్రధాన కార్యదర్శిగా వివేక్, కోశాధికారిగా హమీద్‌లను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు రాజు, మహేశ్, రామన్న, సమీర్, సతీశ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి ఒకటే చేతిపంపు



పెంచికల్‌పేట్: మండలంలోని నందిగామ గ్రామంలో గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా గత నెల రోజులుగా నిలిచిపోవడంతో గ్రామంలోని 60 కుటుంబాల వారు మంచినీటి కోసం గ్రామంలో ఉన్న ఏకైక చేతిపంపుపై ఆధారపడుతున్నారు. నీటి కోసం గంటల తరబడి వేచిచూస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.